పోచంపల్లి పాతరోడ్డును పునరుద్ధరించాలి


ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్–ఆటోనగర్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న పోచంపల్లి పాత రోడ్డును పునరుద్ధరించాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పూర్వకాలంగా ఉన్నటువంటి పోచంపల్లి పాత రోడ్డును 20 ఏళ్ల క్రితం కేంద్ర అటవీశాఖ అధికారులు రోడ్డుకు అడ్డంగా గోడలు కట్టి హరిణి వనస్థలి జాతీయ పార్కులో కలిపారని తెలిపారు. ఈ లింక్‌రోడ్డు పునరుద్ధరణతో సుమారు 100 కాలనీల ప్రజల వాహనాల రాకపోకలకు మేలు జరగడమే కాకుండా జాతీయ రహదారిపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. స్పందించిన ఎంపీ జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పోచంపల్లి పాత రోడ్డు పునరుద్ధరణకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో పాతూరి శ్రీధర్‌గౌడ్, అశోకప్ప, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌సింగ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలకు త్వరలో పరిష్కారం


సమస్యలు తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగోలు: ఆయా కాలనీల్లోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ భరత్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్ గురువారం ఆయన కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. వర్షాలతో కాలనీల్లోని రోడ్లన్నీ బురదగా మారి నడవలేని స్థితిలో ఉన్నాయని వెంటనే నూతన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ వెల్లడించారు. అనంతరం జలమండలి అధికారులు డీజీఎం రవీంద్రనాథ్, స్థానిక కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించారు. గతంలో వేసిన డ్రైనేజీ లైన్ చిన్నగా ఉండటంతో మురుగు బయటకు వచ్చి దుర్వాసన వస్తోందని నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సుజాత, ఏఈ మాతృనాయక్, కాలనీవాసులు స్వామి, భిక్షపతి, మల్లేష్, కొర్లపల్లి స్వామి, కొత్త తిరుమల పాల్గొన్నారు.

సాయి ఆలయంలో దివ్యాంగులకు వివాహం


నూతన జంటకు పట్టువస్త్రాలు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగ జంటకు వివాహం జరిపించారు. వధూవరులకు మంగళ సూత్రాలు, పట్టువస్త్రాలను ట్రస్ట్ మాజీ చైర్మన్ గుండ మల్లయ్య అందజేశారు. అనంతరం ఇరు కుటుంబ సభ్యులకు అన్న ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ బీవీ శ్యామ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు పూర నర్సింహగుప్తా, కోశాధికారి యం.శ్యామలరావు వధూవరులను ఆశీర్వదించారు.

వామ్మో చావురస్తాలు!

- ప్రమాదాలకు నిలయంగా డివైడర్లు, చౌరస్తాలు
- తరచూ ట్రాఫిక్‌జామ్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు, ట్రాఫిక్ పోలీసులు

నగరంలో ట్రాఫిక్‌జామ్ నియంత్రణలో భాగంగా ప్రధాన చౌరస్తాలను బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలతో మూసేసి సుమారు అరకిలోమీటరు దూరంలో డివైడర్‌ను కొంతమేర తొలగించి యూటర్న్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొంత మేర ట్రాఫిక్ జామ్ సమస్య తీరినప్పటికీ పలు యూటర్న్‌ల ప్రాంతాల్లో రాంగ్ రూట్ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. జాతీయ, ప్రధాన రద్దీ రహదారులపై మలుపులు ఏర్పాటు చేయరాదనే నిబంధనలు ఉన్నా చంపాపేట డివిజన్ పరిధిలోని సాగర్‌రింగ్ రోడ్డు నుంచి ఐఎస్ సదన్ చౌరస్తా వరకు, అదే విధంగా అలైఖ్య టవర్ నుంచి డీఎంఆర్‌ఎల్ చౌరస్తా వరకు దాదాపు ప్రధాన చౌరస్తాలన్నీ మూసేసి ఇరుకైన రహదారిపై ఎలాంటి ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేయకుండానే యూటర్న్‌లు ఏర్పాటు చేయటంతో రోడ్డు ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది.

చంపాపేట


పవన్‌పురి ఆర్చి సమీపంలో రహదారికి అడ్డంగా సిమెంట్ దిమ్మెలతో యూటర్న్ ఏర్పాటు చేశారిలా..

కానరాని హెచ్చరిక బోర్డులు..

సాగర్‌రింగ్ రోడ్డు నుంచి ఐఎస్‌సదన్ ప్రధాన రహదారిపై ఉన్న పవన్‌పురి, కర్మన్‌ఘాట్, మానసా గార్డెన్, బైరామల్‌గూడకు హనుమాన్‌నగర్, శ్రీనిధి, దుర్గానగర్, సింగరేణి కాలనీ చౌరస్తాలను బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలతో మూసివేసి ఆయా చౌరస్తాలకు ఇరువైపులా అర కిలో మీటరు దూరంలో ప్రధాన రహదారి పైఉన్న డివైడర్‌ను కొంతమేర తొలగించి రహదారి విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బందిని ఏర్పాటు చేయకుండానే యూటర్న్‌లను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారని ట్రాఫిక్ సిబ్బందిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిపై ఉన్న ప్రధాన రద్దీ చౌరస్తాలన్నీ మూసేసి సింధూర హోటల్,


చంపాపేట 16 కులాల శ్మశానవాటిక ప్రధాన రహదారిపై ఉన్న చౌరస్తాను బారికేడ్లతో మూసేసిన దృశ్యం

మల్‌రెడ్డి రంగారెడ్డి ఆర్చి, పవన్‌పురి కాలనీ ఆర్చి ఎదురుగా ఉన్న రహదారిపై ఎలాంటి హెచ్చరికలు, ఏర్పాటు లేకుండా మలుపులు ఏర్పాటు చేయటంతో చాలా దూరం ప్రయాణించి యూటర్న్ వరకు ప్రయాణం చేయటం ఇష్టం లేని వాహనచోదకులు తక్కువ ప్రయాణ సమయం, ఇంధన పొదుపు కోసం రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ వారితో పాటు ఇతరులను ప్రమాదాలకు గురి చేస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్‌జామ్..

అదే విధంగా అలైఖ్య టవర్ నుంచి డీఎంఆర్‌ఎల్ చౌరస్తా వరకు ఉన్న రహదారిపై నిత్యం శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే వారు అతి వేగంతో ప్రయాణిస్తుంటారు. అదే రహదారిపై టీకేఆర్ ఆర్చి సమీపంలోని చౌరస్తాతో పాటు గాయత్రినగర్, మంద మల్లమ్మ, నిత్యం రద్దీగా ఉండే చంపాపేట పదహారు కులాల శ్మశానవాటిక సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్, విశాలమైన చౌరస్తాలన్నీ మూసి విశ్వాస్ హాస్పిటల్, ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ఆర్చి సమీపంలో రహదారి విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి జాగ్రత్తలు తీసుకోకుండానే మలుపులు ఏర్పాటు చేయటంతో ఆయా ప్రాంతాలలో నిత్యం రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌తో నరకయాతన అనుభవిస్తున్నామని పాదచారులు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యూటర్న్‌లతో సమయం, ఇంధనం వృథా..



బైరామల్‌గూడ చౌరస్తా నుంచి ఐఎస్‌సదన్ వరకు గతంలో ఉన్న ప్రధాన చౌరస్తాలను మూసి డివైడర్‌కు ఇరువైపులా పావు కిలో మీటరు దూరంలో మలుపులు ఏర్పాటు చేయటంతో సమయం, ఇంధన పొదుపు కోసం రాంగ్ రూట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో ఉన్న చౌరస్తాలలోనే ట్రాఫిక్ పోలీసులు, సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలు తగ్గటంతో పాటు ఇంధనం కూడా ఆదా అవుతోంది.

– పాశం శ్రీశైలం, చంపాపేట

ప్రధాన చౌరస్తాలను మళ్లీ తెరవాలి..



డీఎంఆర్‌ఎల్ ప్రధాన రహదారిపై శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో వెల సంఖ్యలో వెళ్లే వాహనాలు వేగంగా దూసుకెళ్తుంటాయి. అదే మార్గంలోని చంపాపేట పదహారు కులాల శ్మశానవాటిక వద్ద ఉన్న ప్రధాన చౌరస్తాను ఇటీవల మూసి కిలోమీటరు దూరంలో ఇరుకైన స్థలంలో ఫ్లై ఓవర్ కింది నుంచి యూటర్న్‌ను ఏర్పాటు చేశారు. దీంతో చంపాపేటకు చేరాలంటే రెండు కిలో మీటర్లు అదనపు దూరాభారం పెరిగింది. దీంతో చాలా మంది రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ప్రధాన చౌరస్తాలన్నింటినీ తెరిచి ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలి.

– యూబీ ఆనందనాయుడు, చంపాపేట

సిమెంట్ దిమ్మెలు తొలగించాలి..



పవన్‌పురి కాలనీ ఆర్చి వద్ద ప్రధాన రహదారిపై అడ్డంగా ఇటీవలే రోడ్డుకు ఇరువైపులా పది అడుగుల వెడల్పుతో రోడ్డుకు అడ్డంగా సిమెంట్ దిమ్మెలతో యూటర్న్‌ను ఏర్పాటు చేశారు. అతి వేగంగా ప్రయాణించే వాహనాలు సిమెంట్ దిమ్మలకు ఢీకొట్టి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉంది. నూతనంగా ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు చెట్ల, చాటున కెమెరాలతో మాటువేసి ఆన్‌లైన్ చలానాలు వేసే పనిలో ఉన్నారే తప్ప ట్రాఫిక్‌ను నియంత్రించే ఆలోచనే లేదు. ఉన్నతాధికారులు స్పందించి సిమెంట్ దిమ్మెలను తొలగించాలి.

– రాము, చంపాపేట చిలుక బస్తీ

గుడికి వెళ్లిన గృహిణి అదృశ్యం


ఎన్.మీనా

సైదాబాద్: గుడికి వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చంపాపేట ఎస్ఎన్‌రెడ్డి నగర్‌లో నివసించే ఎన్. మీనా (42) మంగళవారం కర్మాన్‌ఘాట్‌లోని గుడికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లి ఎంతకీ ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం భర్త అరవింద్‌కుమార్ జైస్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రేపు ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో తత్వ ప్రవచనాలు


బాల బ్రహ్మానంద సరస్వతి


చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో శనివారం శ్రీనైమిషారణ్య పీఠం అధిపతి బాల బ్రహ్మానంద సరస్వతీచే ఆంజనేయ ఆధ్యాత్మిక తత్వ ప్రవచనాలు ఉంటాయని ఈఓ లావణ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.40 నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోరారు.

దర్గా ఉర్సు ప్రారంభం


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి చింతలకుంటలోని విజయవాడ జాతీయ రహదారికి పక్కన ఉన్న హజ్రత్ అబ్దుల్ ఖాదీర్ షాహెద్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు జరుగుతాయని 429 సంవత్సరాల చరిత్ర గల అతి పురాతనమైన దర్గా అని ముతావలి సయ్యద్ పాషా తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ ఖాసీం, ఖాజాపాషా, సయ్యద్‌షా, సయ్యద్ అన్వర్‌పాషా, సయ్యద్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

చిత్రం.. సందేశం



మహిళలు, యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఆకృత్యాలపై ఎల్‌బీనగర్‌కు చెందిన చిత్రకారుడు కార్టూనిస్టు నాగార్జునపు రాము వినూత్నంగా తన కుంచె, పెన్సిల్ ద్వారా చిత్రాలను రూపొందించి తన నిరసనను వ్యక్తపరిచాడు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను రూపుమాపేలా కృషి చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని ఈ సందర్భంగా రాము విజ్ఞప్తి చేశాడు. – నాగోలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?


పోలీస్ స్టేషన్ ఎదుట మాలతి

హస్తినాపురం: ఇంటి అద్దె కోసం వెళ్తే కులం పేరు అడిగి ఎస్సీలకు అద్దెకివ్వమని అవమానకరంగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే వనస్థలిపురం పోలీసులు పట్టించుకోవడం లేదని ఓ మహిళ ఆరోపించింది. ఈ సందర్భంగా బాధితురాలు కుమటం మాలతి సాక్షితో మాట్లాడుతూ.. ఈ నెల 18న నేను నా కూతురు ఆకాంక్ష, ఆమె స్నేహితురాలితో కలిసి వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని దాసరి ఉద్దానయ్య ఇంట్లో ఇల్లు అద్దెకు ఉందని చెప్పడంతో వెళ్లి అడిగితే రూ.22 వేలు అని ఆ తర్వాత మా కూతురు ఆకాంక్షను కులం అడగగా ఎస్సీ అని చెప్పింది. ఇల్లు అద్దెకివ్వమని చెప్పడంతో నా కూతురు మనస్తాపానికి గురైందన్నారు.తాను అదే రోజు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశామని తర్వాత వెళ్లి అడిగితే నా దృష్టికి రాలేదని ఇన్‌స్పెక్టర్ తిరిగి తేదీ మార్చి ఈ నెల 20న మరో ఫిర్యాదు రాయించి తీసుకున్నారని గత ఐదు రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయింది. గంటల తరబడి స్టేషన్‌లో కూర్చుబెట్టి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్న వనస్థలిపురం పోలీసులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని లేదంటే తాను పోలీస్ స్టేషన్ ముందే ఆత్మహత్య చేసుకుంటామని బాధితురాలు హెచ్చరించారు.

పొంగుతున్న డ్రైనేజీలు.. పట్టించుకోని అధికారులు


రోడ్డుపై పారుతున్న మురుగు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ– బ్లెండ్స్ కాలనీ లాస్ట్ బస్టాప్ వరకు గత వారం రోజులుగా డ్రైనేజీలు పొంగి రోడ్డుపై మురుగు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథులే లేరని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచూ మురుగు పారడంతో రోడ్డు ధ్వంసమై ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని దీంతో పాటు దుర్వాసనతో రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైపురికాలనీలోని మీ–సేవ కేంద్రం వర్షం పడితే మోకాళ్ల లోతు నీళ్లు చేరతాయన్నారు. గతంలో ఈ సమస్యపై కార్పొరేటర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

శుభాకాంక్షలు

చాదర్‌ఘాట్: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొ.కోదండరామ్‌ను ఓల్డ్‌మలక్‌పేట కాంగ్రెస్ నేతలు గురువారం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్‌లో మలక్‌పేటలో నిర్వహించే గణేష్ ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో నాయకులు బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, లక్ష్మణ్, మహ్మద్ గౌస్ ఉన్నారు.

అన్నదానం

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో మెహిదీ నవాబ్‌జంగ్ కేన్సర్ ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. గురువారం 650 మంది రోగుల సహాయకులకు అన్నదానం, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ తరచూ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. సమాజ సేవ చేయడంలోనే ఎంతో తృప్తి ఉంటుందన్నారు. కేఆర్ రాజ్‌కుమార్, మహ్మద్ వహీద్, ఆసుపత్రి టీఎన్జీఓస్ నాయకులు శివకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన కొలను పరిశీలన

నాగోలు: నాగోలు చెరువు కొలనును గురువారం కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాగోలు చెరువు, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని విద్యుత్ తీగల విషయంపై సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ప్రశాంతంగా వినాయక నిమజ్జనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్ బాబు, ఏఈ రాకేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మధ్యలో ఆగిన లిఫ్ట్

నాగోలు: అకస్మాతుగా లిఫ్ట్ ఆగిపోవడంతో అందులో ఉన్న ఇద్దరిని కాపాడిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు డివిజన్ పరిధిలోని రాజీవ్ స్వగృహ సహాభవన టౌన్‌షిప్‌లో గురువారం మధ్యాహ్నం రాంబాబు, సతీష్ అనే ఇద్దరు వ్యక్తులు 7వ అంతస్తు నుంచి కిందికి వస్తున్నారు. అకస్మాతుగా లిఫ్ట్ ఆగిపోయింది. అందులో ఉన్న ఇద్దరు గంట పాటు ఉక్కిరిబిక్కిరి అవుతూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడిపారు. లిఫ్ట్‌లోని ఎమర్జెన్సీ అలారం మోగించినా ఎవరూ స్పందించలేదు. చివరికి వారే అగ్ని మాపక సిబ్బంది(101)కి ఫోన్ చేయడంతో అధికారి శ్రీధర్ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని అధునాతన పరికరాలతో లిఫ్ట్‌లో చిక్కుకున్న ఇద్దరిని క్షేమంగా బయటకు రప్పించారు.


లిఫ్ట్‌లో చిక్కుకున్నవారిని కాపాడిన సిబ్బంది

నిందితులను ఉరి తీయాలి


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

చంపాపేట: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వేదా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం చంపాపేట ఎస్‌జీఆర్ కాలనీలోని వేదా డిగ్రీ కళాశాలకు చెందిన 'స్పృహ' విద్యార్థుల టీమ్ ఆధ్వర్యంలో చంపాపేట చౌరస్తా వరకు భారీర్యాలీ నిర్వహించారు. నేరస్తులను బహిరంగంగా ఉరితీయాలని మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలకు పాల్పడే వ్యక్తుల గుండెల్లో దడ పుట్టించేలా ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనూరాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో..

మలక్‌పేట: కోల్‌కతా వైద్యురాలి హత్యకు నిరసనగా దిల్‌సుఖ్‌నగర్ అనిబిసెంట్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ సెక్రటరీ శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మాయిలు ఆత్మవిశ్వాసం, మనో ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాలేజ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గడ్డిఅన్నారం క్రాస్‌రోడ్, మారుతి మందిర్, దిల్‌సుఖ్‌నగర్ మీదుగా కాలేజ్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజవల్లి, ఏఓ రవీందర్, అనిల్, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


అనిబిసెంట్ కళాశాల వద్ద..

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్:సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.17, వంకాయ రూ.28, బెండ రూ.18, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.45, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, అర్వి రూ.40, మునగ రూ.23, చిలుకడ దుంప రూ.55, బీట్ రూట్ రూ.33, కీర రూ.23, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.50.

ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సమాజంలో ఉపాధ్యాయులది అత్యున్నత స్థానం


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

హస్తినాపురం: సమాజంలో ఉపాధ్యాయులతో అత్యున్నత స్థానమని రేపటి సమాజం రథసారథులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని లయన్స్ జిల్లా గవర్నర్ 320–ఏ డాక్టర్ కోటేశ్వరరావు అన్నారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్వెస్ట్ ఆధ్వర్యంలో జిల్లా లయన్స్ క్వెస్ట్ చైర్ పర్సన్ మాధవరావు శ్రీభవ్య ఇంటర్నేషనల్ స్కూల్ హస్తినాపురంలో 30 మంది టీచర్స్‌కి రెండు రోజులు ఉచితంగా టీచర్ ట్రైనింగ్ వర్క్ షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి. మహేంద్రకుమార్‌రెడ్డి, లయన్ కందాళ గోవింద్‌రాజ్, ట్రైనర్ రేణుక కొండపల్లి పాల్గొన్నారు.